రూ.5 కోట్ల అంచనాతో బస్ కాంప్లెక్స్ పనులు

ప్రజాశక్తి-అమలాపురం

అంబేద్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో సుమారు రూ.5 కోట్ల అంచనా వ్యయంతో మోడల్ ఆర్‌టిసి స్టేషన్ కాంప్లెక్స్ నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు కేటాయించినట్టు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్‌ను తొలగించి దాని స్థానే మోడరన్ బస్ స్టేషన్ కాంప్లెక్స్ పూర్తిస్థాయిలో నిర్మించ నున్నట్లు మంత్రి విశ్వరూప్ తెలిపారు. ఈ మోడల్ స్టేషన్ కాంప్లెక్స్‌లో 24 ప్లాట్ ఫారాలతో పాటు నాలుగంతస్తులతో బస్ స్టేషన్ కాంప్లెక్స్ నిర్మించనున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటికే పరిపాలనా పరమైన ఆమోదం వచ్చిందని, త్వరలో బస్ స్టేషన్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు.

అరెస్టులు, నిర్బంధాలకు బెదరం

- అక్రమ అరెస్టులు, నోటీసులు
- వెనక్కి తగ్గబోమంటున్న అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు

అమలాపురం పోలీస్ స్టేషన్లో అంగన్వాడీ కార్యకర్తలు

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరితే ముఖ్యమంత్రి జగన్ మహిళలను అణగదొక్కాలని చూస్తున్నారంటూ అంగన్‌వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చలో విజయవాడ పిలుపు నేపథ్యంలో జిల్లా నుంచి విజయవాడకు పలువురు కార్యకర్తలు ఆదివారం బయల్దేరారు. ఈ విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఎక్కడికక్కడ మోహరించి అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. రైళ్లు, బస్సుల్లోకి వెళ్లి విజయవాడ వెళ్తున్న కార్యకర్తలను బలవంతంగా దించేశారు. అదుపులోకి తీసుకుని సమీప పోలీసు స్టేషన్లకు తరలించారు. జిల్లా నుంచి 600 మంది విజయవాడకు తరలి వెళ్లినట్లు నాయకులు తెలిపారు. పోలీసులు ఉద్యమకారులకు నోటీసులు ఇచ్చి 23 మందిని అదుపులోకి తీసుకున్నారు. రాజోలులో సుమారు 31 మందిని, అంబాజీపేటలో 23 మంది అంగన్వాడీ సిబ్బందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి అంగన్వాడీలు సమ్మె చేస్తున్న శిబిరాలను తొలగించి అంగన్వాడీలను హౌస్ అరెస్టు చేయడం సమ్మె నోటీసులు జారీ చేయడం చేశారు. సోమవారం అంగన్వాడీలను పోలీస్ స్టేషన్లో నిర్బంధించారు. అయినా సరే వెనక్కి తగ్గేది లేదని తమ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని అంగన్వాడీలు చెబుతున్నారు.

ఎన్ని అడ్డంకులు వచ్చిన సమ్మెను ఆపేది లేదు

ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సష్టించినా అంగన్వాడీల సమ్మె ఆపే ప్రసక్తి లేదు. చలో విజయవాడ కార్యక్రమాన్ని అడ్డుకోవడం చాలా దారుణం. 42 రోజుల నుండి సమ్మె చేస్తుంటే ప్రభుత్వంలో చలనం లేకపోగా ఉద్యోగాల నుండి తొలగిస్తామనడం ఎంతవరకు సబబు. రాత్రి నుంచి పోలీసుల గృహనిర్బంధాలు, అరెస్టులతో అంగన్వాడీలను వేధిస్తున్నారు. సమస్య పరిష్కారం అయ్యేవరకు వెనక్కి తగ్గేది లేదు.

- కె.బేబీ గంగారత్నం, అమలాపురం ప్రాజెక్టు కార్యదర్శి.

అర్ధరాత్రి దీక్షా శిబిరాలు తొలగిస్తారా..

42 రోజుల నుంచి సమ్మె చేపడదితే సమస్యకు పరిష్కారం చూపకపోగా అర్ధరాత్రి దీక్ష శిబిరాన్ని తొలగించడం ఎంతవరకు సమంజసం. నాలుగు ఐదు రోజుల క్రితం ప్రభుత్వం నోటీసులు జారీ చేస్తే మండలం మొత్తం సమైక్యంగా వివరణ ఇచ్చాం. కనీస వేతనం కోసం సమ్మె చేపట్టిన పెరిగిన ధరలు కనుగుణంగా కనీస వేతనం పెంచకుండా నిరంకుశంగా వ్యవహరించడం దారుణం.

- మట్టపర్తి వెంకటలక్ష్మి, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్, అంబాజీపేట.

అంగన్‌వాడీలను నేరస్తుల్లా చూడడం దారుణం

పెరిగిన ధరల నేపథ్యంలో చాలీచాలని జీతంతో ఒకపక్క, అంగన్వాడీలు సొంత ఖర్చులతో బిల్లులు రాక అనేక రకమైన ఇబ్బందులు పడుతున్న అంగన్వాడీ వర్కర్లను ఈ విధంగా నేరస్తుల్ని చూసినట్టు వ్యవహరించడం సిగ్గుచేటు. 42 రోజులుగా జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చాల్సిందిగా ధర్మపోరాటం చేస్తున్న అంగన్వాడీ వర్కర్స్‌ను విధుల నుంచి తొలగించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయడం ఏమాత్రం తగదు. వచ్చే ఎన్నికల్లో ప్రజాస్వామ్యంలో ఓటర్లు తన శక్తి చూపించడానికి సిద్ధంగా ఉన్నారు.

- గంటి హరీష్ బాలయోగి, టిడిపి అమలాపురం పార్లమెంట్ ఇన్‌ఛార్జి.

ఎన్నికల జాబితా విడుదల చేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఎన్నికల తుది జాబితా విడుదల

ప్రజాశక్తి-అమలాపురం

ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు సోమవారం తుది జాబితా ప్రచురణ ప్రతులను అందించినట్టు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 అనుసరించి కోనసీమ జిల్లావ్యాప్తంగా ముసాయిదా ప్రకారం మొత్తం ఓటర్లు 14,88,794 మంది నమోదు కాగా తుది జాబిత ప్రకారం మొత్తం ఓటర్లు 15,10,472 మందికి చేరారన్నారు. ముసాయిదా తుది జాబితాల మధ్య వ్యత్యాసం మొత్తం 21,678 మందిగా నమోదయ్యారని చెప్పారు. వీరిలో పురుషులు 9,317 మంది కాగా, స్త్రీలు 12,366 మంది ఉన్నారన్నారు. ట్రాన్స్‌జెండర్స్ తుది జాబితాలో ఐదుగురు తగ్గడంతో జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌జెండర్లు 17 మందిగా నమోదయ్యారన్నారు. తుది జాబితా ప్రకారం జిల్లావ్యాప్తంగా పురుష ఓటర్లు మొత్తం 7,50,066, మంది కాగా స్త్రీ ఓటర్లు మొత్తం 7,60,389 మందిగా నమోదు, ట్రాన్స్‌జెండర్స్ 17 మంది నమోదు కాగా వెరసి జిల్లావ్యాప్తంగా మొత్తం ఓటర్లు 15,10,472 మంది ఉన్నారన్నారు. తుది జాబితా ప్రకారం రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గంలో పురుష ఓటర్లు 99,361 మంది కాగా, స్త్రీ ఓటర్లు 1,00,785 మంది ఒక ట్రాన్స్‌జెండర్ నమోదయ్యారని, మొత్తం ఓటర్లు 2,00,147 మందిగా నమోదయ్యారన్నారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,20,680 మంది కాగా, స్త్రీ ఓటర్లు 1,21,190 మందిగా నమోదు కాబడి వెరసి మొత్తం ఓటర్లు 2,41,870 నమోదు అయ్యారన్నారు. అమలాపురం నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,05,166 మంది, స్త్రీ ఓటర్లు 1,05,724 మంది, రాజోలు నియోజకవర్గంలో పురుష ఓటర్లు 96,552 మంది, స్త్రీ ఓటర్లు 98,637 మంది, పి.గన్నవరం నియోజకవర్గంలో పురుష ఓటర్లు 98,969 మంది, స్త్రీ ఓటర్లు 97,363 మంది, కొత్తపేట నియోజకవర్గంలో పురుష ఓటర్లు 1,23,389 మంది కాగా, స్త్రీ ఓటర్లు 1,24,998 మంది, మండపేట నియోజకవర్గంలో పురుష ఓటర్లు1,05,949 మంది, స్త్రీ ఓటర్లు 1,11,692 మంది నమోదయ్యారు. రామచంద్రపురం నియోజకవర్గంలో ముసాయిదా జాబితా కన్నా పెరిగిన ఓటర్లు 2,146, ముమ్మిడివరంలో 3,373, అమలాపురంలో 4,508, రాజోలులో 3,501, గన్నవరంలో 2,862, కొత్తపేటలో 3,037, మండపేటలో 2,251, మొత్తం జిల్లావ్యాప్తంగా 21,678 మంది ఓటర్లు పెరిగారన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబు, కాంగ్రెస్ తరపున కామన ప్రభాకర్ రావు, టిడిపి తరపున అల్లాడి స్వామి నాయుడు, వైసిపి తరపున సంసాని నాని, షేక్ అబ్దుల్ ఖాదర్, బిజెపి తరపున దూలం రాజేష్, సిపిఎం తరపున కారెం వెంకటేశ్వరరావు, బిఎస్‌పి తరపున కాశీ లక్ష్మీ భవాని, సిపిఐ తరపున సత్తిబాబు పాల్గొన్నారు.

మండపేటలో 50 శాతం కుల గణన సర్వే పూర్తి

మండపేట : మండలంలోనీ 12 గ్రామ పంచాయతీల్లో ఇప్పటివరకు 50 శాతం కుల గణన పూర్తయినట్టు ఎంపిడిఒ ఐదం రాజు అన్నారు. 519 క్లస్టర్లలో 29,179 హౌస్ హోల్డ్స్ ఉన్నాయని ఇప్పటివరకు 16 వేల హౌస్ హోల్డ్‌లలో కుల గణన పూర్తి కాగా మరో 13 వేల మందికి సంబంధించి కుల గణన జరగాల్సి ఉందన్నారు. అధికారులతో పాటు సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు ఈ కులగణలో పాల్గొంటున్నారన్నారు. కేశవరం గ్రామంలో ఎంపిపి ఉండమట్ల వాసు కుల గణన కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల గణనతో ఆయా మైనార్టీ వర్గాలకు, వెనకబడిన తరగతులకు ఉపయోగంగా ఉంటుందని సంక్షేమ పథకాలు. అందరికీ సమానంగా అందే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పినిపే చంద్రశేఖర్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ పాల్గొన్నారు.

స్పందనలో సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ శుక్లా

జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి భవన్‌లో జిల్లాస్థాయి జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్ఒ సిహెచ్.సత్తిబాబుతో కలిసి జిల్లావ్యాప్తంగా ప్రజల నుంచి వచ్చిన వినతులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ అత్యంత ప్రాధాన్యతా క్రమంలో వినతులను సకాలంలో పరిష్కరిస్తూ స్పందన పని తీరు పట్ల అర్జీదారులలో నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, సామాజిక భద్రత పింఛన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి సుమారు 156 అర్జీలు వచ్చాయన్నారు. జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంలో అందిన ప్రతి వినతినీ పరిశీలించి అర్జీదారులకు సంతృప్తికరమైన పరిష్కార మార్గాలు చూపాలన్నారు. ఒకసారి ఒక అంశంపై సమర్పించిన అర్జీ మరలా అదే అంశంపై రీ ఓపెన్‌కు ఆస్కారం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, గ్రామ వార్డు సచివాలయ నోడల్ అధికారి కె.భీమేశ్వర్, డిపిఒ వి.కృష్ణకుమారి, డిఎం అండ్ హెచ్ఒ ఎం.దుర్గారావు దొర డిఎస్ఒ ఎ.పాపారావు, డిఇఒ, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ అధికారులు పాల్గొన్నారు.

కవిబంధు విక్రమ్‌ను సత్కరిస్తున్న సంఘం నాయకులు

కవి బంధు విక్రమ్‌కు ఘన సత్కారం

ప్రజాశక్తి -మామిడికుదురు

కవి బంధు పుస్కార గ్రహీత డాక్టర్ పొలమూరి విక్రమ్‌ను కోనసీమ వత్తి కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మంగం సత్యనారాయణ, అడబాల సత్యనారాయణ మూర్తి, అడబాల వెంకట స్వామి నాయుడు, చిట్టూరి దాశరథి, కె.అర్జున్‌రావు, ఆర్.వెంకట్రావు పాల్గొన్నారు.

దాతలకు జ్ఞాపికలు అందిస్తున్న ఆలయ సిబ్బంది

నిత్యాన్నదాన ట్రస్ట్‌కు విరాళం

ప్రజాశక్తి -మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు సోమవారం మురమళ్ల వాసులు నడింపల్లి వీర వెంకట సూర్య వర్మ, వరలక్ష్మి దంపతులు రూ.10 వేల విరాళం ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంది మాధవి తెలిపారు. దాత దంపతులకు ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు.

అర్తమూరులో 2వ రోజు బాబు ష్యూరిటీ..

మండపేట : మండలంలోని అర్తమూరులో 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ' కార్యక్రమం సోమవారం రెండో రోజు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను జగన్ అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా తుంగలో తొక్కారన్నారు. ఆంధ్రరాష్ట్రానికి పూర్వ వైభవం రావాలంటే రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమిని గెలిపించుకోవాలన్నారు.

కార్టూ'నిజం'



విద్యార్థిని అభినందిస్తున్న అధ్యాపకులు

చెస్ టోర్నమెంట్‌కు గౌతమ్ ధర్మ

ప్రజాశక్తి-కాట్రేనికోన

చెయ్యేరు శ్రీనివాస స్వయం ప్రతిపత్తి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి జెఎన్‌టియు సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజీ టోర్నమెంట్ చెస్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. కళాశాల విద్యార్థి కె.గౌతమ్ ధర్మ, తమిళనాడు తిరుచునాపల్లిలో భారతీదాస్ యూనివర్సిటీలో ఈ నెల 26 నుండి 29 వరకు జరిగే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ చెస్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు తెలిపారు. గౌతమ్‌ను కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డివిఎస్ఎస్.వర్మ, సందీప్, ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ఎస్‌వి.పరమేశ్వరావు, డాక్టర్ ఎస్.జయలక్ష్మి, డాక్టర్ బి.రత్నరాజు, కళాశాల పీడీ షేక్ సరవల్లి ఆలీ అభినందించారు.


ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేస్తున్న సిబ్బంది

11,029 ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలో ఇప్పటివరకు 11,029 ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. దంగేరు పిహెచ్‌సి పరిధిలోని యర్రపోతవరంలో సోమవారం కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ ఎన్.ప్రశాంతి పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డులు లబ్ధిదారులకు అందరికీ చేరాలని వాలంటీర్ యాప్‌లో ఆ ప్రక్రియలు పూర్తి చేసి ప్రజలకు అందించాలని చెప్పారు. రూ.25 లక్షల వరకు నెట్‌వర్క్ ఉన్న హాస్పిటల్లో ఉచిత వైద్యం అందిస్తారని తెలిపారు.

అంగన్‌వాడీలపై ప్రభుత్వ కర్కశం

ప్రజాశక్తి-యంత్రాంగం

అమలాపురం అంగన్వాడీలపై ప్రభుత్వ నిర్బంధాన్ని ఆపాలని, వారిని చర్చలకు ఆహ్వానించి సమస్యను పరిష్కరించాలని పలు పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం, సిపిఐ, టిడిపి, జనసేన, ఆర్‌పిఐ నాయకులు సోమవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం అధారంగా అవసరమైతే ట్రేడ్ యూనియన్లు నిర్ణయిస్తే రాష్ట్ర బంద్‌కు సిద్ధపడతామని హెచ్చరించారు. అదుపులోకి తీసుకున్న అంగన్‌వాడీలను వెంటనే విడుదల చేయాలని, చర్చలకు ఆహ్వానించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వ మొండితనం వల్లే అంగన్వాడీలు ఆందోళన బాటపట్టారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి అహంకార వైఖరితో సమస్యను జటిలం చేశారని పేర్కొన్నారు. అంగన్వాడీలవి అత్యవసర సర్వీసులని 26 రోజుల తరువాత ప్రభుత్వానికి గుర్తు రావడం సిగ్గుచేటన్నారు. ముఖ్యమంత్రి ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి వారిపైనే యుద్ధం చేస్తున్నారన్నారు. చట్టప్రకారం సమ్మె నోటీసు ఇస్తే సమయం ఇవ్వాలని కోరిన ప్రభుత్వం ఎందుకు చర్చించలేకపోయిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు, ఆర్‌పిఐ నాయకుడు డి.బి.లోక్ సిపిఎం జిల్లా కన్వీనర కారెం వెంకటేశ్వరరావు, కె.సత్తిబాబు, డాక్టర్ నాగ మానస, ప్రజా సంఘాల నాయకులు జి.దుర్గాప్రసాద్, సత్తిరాజు, కె.శంకర్, అమూల్య, బేబీ గంగారత్నం తదితరులు పాల్గొన్నారు.


అమలాపురం కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న పలు పార్టీల నాయకులు

మండపేటలో..

కాట్రేనికోనలో..

ఐ.పోలవరంలో..

రాష్ట్రబంద్‌కు ట్రేడ్ యూనియన్ల పిలుపు

అంగన్వాడీలపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ రాష్ట్ర అఖిలపక్ష ట్రేడ్ యూనియన్లు ఈ నెల 24న రాష్ట బంద్‌కు పిలుపునిచ్చాయి. అంగన్వాడీల చలో విజయవాడను పోలీసులు అడ్డుకోవడం, విధుల నుంచి వారిని టెర్మినేట్ చేయడంపై అఖిలపక్షం అభ్యంతరం వ్యక్తం చేసింది.

ఐ.పోలవరం సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గా ప్రసాద్‌ను ఆదివారం రాత్రి తన నివాసంలో రాత్రి 8 గంటలకు భోజనం చేస్తున్న సమయంలో పోలీసులు అరెస్టు చేసి ఎదుర్లంక పోలీస్ స్టేషన్ తరలించారు. సోమవారం విజయవాడ వెళుతున్న అంగనవాడీలను అదే పోలీస్ స్టేషన్ తరలించారు. దీంతో అప్పటికే అక్కడ ఉన్న దుర్గాప్రసాద్ అంగన్‌వాడీలతో కలిసి నినాదాలు చేశారు. దుర్గాప్రసాద్‌ను వెంటనే విడుదల చేయాలని అంగన్వాడీ యూనియన్ పాజెక్టు కార్యదర్శి ఎం.జయలక్ష్మి ఆధ్వర్యాన పోలీస్ స్టేషన్ వద్ద బైఠాయించారు. ఎస్ఐ సి.హెచ్ రాజేష్ వారందరికీ భోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం దుర్గాప్రసాద్‌ను విడుదల చేశారు. 30 మంది అంగన్‌వాడీలను దుర్గాప్రసాద్ వ్యక్తిగత పూచీకత్తుపై విడిపించారు.

ఉప్పలగుప్తం సిఐటియు నాయకురాలు పి.బేబీ గంగారత్నం, మరో 59 మంది అంగన్‌వాడీలను ఎస్ఐ జి.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించి, అనంతరం వ్యక్తిగత పూచి కత్తుపై విడుదల చేశారు.

రామచంద్రపురం చలో విజయవాడకు తరలి వెళ్లిన వర్కర్లను పోలీసులు ఆర్‌టిసి బస్సుల్లో ఎక్కించి రాష్ట్రంలో పలు ప్రాంతాలకు తరలించారు. ఏలూరు, మచిలీపట్నం, నూజివీడు, కైకలూరు వంటి ప్రాంతాలకు వర్కర్లను తరలించినట్లు రామచంద్రపురం వర్కర్ల నాయకులు ఎం.దుర్గ, యాళ్ల దేవి తదితరులు విలేకరులకు ఫోన్ చేసి వివరించారు. తమకు కనీస సౌకర్యాలు లేకుండా వివిధ ప్రాంతాలకు తరలించడం పట్ల వారంతా నిరసన తెలిపారు. తమ హక్కుల కోసం ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం కోసం సమ్మెను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

మండపేట విజయవాడ వెళ్లేందుకు బయలుదేరిన అంగన్వాడీలను పోలీసులు ఎక్కడెక్కడ నిర్బంధించారు. కొంతమందిని బందరు పోలీస్ స్టేషన్‌కు తరలించగా మరికొంతమందిని మండపేట రూరల్, రాయవరం పోలీస్ స్టేషన్లకు తీసుకువెళ్లారు. తెల్లవారుజామున రెండు గంటల నుంచి అరెస్టులు కొనసాగాయని కనీసం టీ, కాఫీ కాలకృత్యాలు తీర్చుకునేందుకు కూడా అవకాశం ఇవ్వట్లేదని బందరు పోలీస్ స్టేషన్‌లో ఉన్న అంగన్వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు.

కాట్రేనికోన విజయవాడ బయల్దేరిన అంగన్‌వాడీలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో స్టేషన్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు విత్తనాల రాంబాబు, ఎం.విజయకుమారి, పి.పార్వతి, బి.రమాదేవి, ఆర్.మంగయ్యమ్మ భారతి, చైతన్య, లక్ష్మి, గౌరీ, గీత, అనురాధ పాల్గొన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా సమ్మె చేస్తున్న అంగన్వాడీలపై ఎస్మా ప్రయోగించి ఉద్యోగాల నుండి తొలగించడం దుర్మార్గపు చర్య అని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, మండల అద్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు అన్నారు. మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సమ్మె చేస్తుంటే జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం దారుణమన్నారు. సత్తాల ప్రసాద్, రేవు రమేష్, జొన్నాడ రాజారావు, విత్తనాల బుజ్జి, బీర అంబేద్కర్, వాసంశెట్టి రాజేశ్వరరావు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు అంగన్‌వాడీలకు మద్దతు తెలిపారు.

నేరాలు ఘోరాలు

మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్న అధికారులు

అక్రమ మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఫైబర్ బోటులో అక్రమంగా నిల్వ ఉంచిన మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బలుసుతిప్పలోని గోదావరి నది పాయలో ఫైబర్ బోటులో నిల్వ ఉంచిన 1,079 మద్యం బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.లక్షా 25 వేల విలువ ఉంటుందని చెప్పారు. అక్రమ మద్యాన్ని నిల్వ ఉంచిన బోటు ఎవరిది, ఎవరు నిల్వ చేశారో దర్యాప్తు చేస్తున్నామని ముమ్మిడివరం సిఐ కొండయ్య తెలిపారు. యానాం నుంచి ఎవరైనా పెద్ద మొత్తంలో మద్యాన్ని కొనుగోలు చేసి సరఫరా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, యానాం షాపులలో చట్టపరంగా కాకుండా ఎక్కువ మొత్తంలో అక్రమంగా మద్యాన్ని అమ్మితే వారిపై కూడా కేసులు నమోదు చేస్తామని సెబ్ ఎస్.ఐ రాజేష్ హెచ్చరించారు.

1398 బాటిళ్ల మద్యం స్వాధీనం

ప్రజాశక్తి - తాళ్లరేవు

అక్రమంగా యానాం నుంచి మద్యం తీసుకువచ్చి అమ్ముతున్న ఒకరిని అరెస్టు చేసి, రిమాండ్ కు తరలించినట్లు కోరంగి ఎస్ఐ రవికుమార్ తెలిపారు. మండలంంలోని కోరంగి పంచాయితీ చిన్న బొడ్డు వెంకటాయపాలెంలో అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకానికి సిద్దంగా ఉన్న 1398 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని గ్రామానికి చెందిన పెశింగి దుర్గను అరెస్టు చేసి కేసు నమోదు చేసి కాకినాడ కోర్టుకు తరలించారు.

లారీని ఢీకొన్న వ్యాన్

ప్రజాశక్తి - గోపాలపురం

లారీ బ్రేక్ వేయడంతో ఐషర్ వ్యాన్ అదుపుతప్పి లారీని ఢీకొంది. ఆదివారం అర్ధరాత్రి గోపాలపురం శివారు దుర్గమ్మ గుడి సమీపంలో గీ ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి కలకత్తాకు పైపులు లోడుతో ఐషర్ వ్యాన్ బయలుదేరింది. గోపాలపురం శివారు దుర్గమ్మ గుడి సమీపంలో వద్దకు వచ్చేసరికి ముందు వెళుతున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో వెనక వస్తున్న వ్యాన్ లారీ వెనకవైపు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వ్యాన్ ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

గ్యాస్ సిలెండర్‌ల స్వాధీనం

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

మండలంలోని పలు హోటల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లలో వాడే డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్‌లు ఉపయోగిస్తుండటంతో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మండల సివిల్ సప్లై అధికారి కీర్తి ఆధ్వర్యంలో సోమవారం అధికారులు పలు హోటళ్లలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు హోటల్ లో కమర్షియల్ సిలిండర్ లకు బదులుగా డోమెస్టిక్ సిలిండర్ లు వాడుతున్నట్లు గుర్తించి వ్యాపారుల నుంచి 7 డోమెస్టిక్ సిలిండర్ లను సీజ్ చేసి హోటల్ నిర్వాహకులపై 6(ఎ) కేసులను నమోదు చేశారు. ఈ దాడుల్లో సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

బాలిక హత్య కేసులో సవతి తల్లికి శిక్ష

ప్రజాశక్తి - కాకినాడ

బాలిక హత్య కేసులో నేరం రుజువు కావడంతో సవతి తల్లికి కాకినాడ 4వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ యావజ్జీవ కారాగార శిక్ష విధించారు. కాకినాడ వన్ టౌన్ ఎస్‌హెచ్‌ఒ వి.సురేష్ బాబు వెల్లడించిన వివరాల ప్రకారం...2019 నవంబర్ 22న జగన్నాధపురంలోని నేతాజీ మున్సిపల్ స్కూల్లో రెండవ తరగతి చదువుతున్న సూరడ దీప్తి అనే అమ్మాయిని సవతి తల్లి సూరాడ శాంతి కుమారి స్కూల్ నుంచి ఇంటికి తీసుకువెళ్లి టవల్‌తో పీక బిగించి హత్య చేసింది. అనంతరం ఇంద్ర పాలెం బ్రిడ్జి నుంచి ఉప్పుటేరు కాలువలో విసిరేసింది. దీప్తి తండ్రి సత్య శ్యాంకుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి వన్ టౌన్ ఎస్ఐ సుప్రియ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి ముద్దాయిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు విచారణ పూర్తయిన అనంతరం చార్జిషీటు న్యాయస్థానంలో ఫైల్ చేశారు. సాక్షుల విచారణ, వాదోపవాదనలు విన్న అనంతరం నేరం రుజువు కావడంతో ముద్దాయి సూరాడ శాంతి కుమారికి సోమవారం యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ తరపున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.ప్రశాంతి కుమారి వాదనలు విన్పించారు. ఈ కేసులో ముద్దాయిని అరెస్టు చేయడంలో కీలకపాత్ర పోషించిన పోలీసులను డిఎస్‌పి పి.మురళీకృష్ణారెడ్డి, ఇతర అధికారులను ఎస్‌పి అభినందించారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్ మృతి

ప్రజాశక్తి - మామిడికుదురు

లైన్‌మేన్ రాంబాబు

గోగన్నమఠంలో సోమవారం సాయంత్రం విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌తో లైన్‌మేన్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎలక్ట్రికల్ లైన్‌మేన్ నౌండ్రు రాంబాబు (46) విద్యుత్ మరమ్మతు పనులు చేస్తుండగా విద్యుత్ షాక్‌తో అక్కడికక్కడే చనిపోయినట్లు స్థానికులు నగరం పోలీసులకు సమాచారం ఇచ్చారు. రాంబాబు మతితో వాకలగరువులో విషాద ఛాయలు చోటు చేసుకున్నాయి. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరు ముగ్గురు సోదరులు కాగా ఇటీవలే మూడో సోదరుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం నిరాశ్రయమయ్యింది. ఇటీవల పాశర్లపూడిలో విద్యుత్ మరమ్మతులు చేస్తూ ప్రైవేటు ఎలక్ట్రీషియన్ మృతి చెందిన సంఘటన మరువక ముందే మరో సంఘటన చోటు చేసుకోవడంతో విద్యుత్ శాఖ అధికారులు నిర్లక్ష్యానికి నిదర్శనమని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

శిరోముండనం బాధితులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి

ప్రజాశక్తి-రామచంద్రపురం

తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న దళిత నాయకులు

శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు వెంటనే మంజూరు చేయాలని పలువురు ప్రజాసంఘాల నాయకులు సోమవారం ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో దళిత ఐక్య పోరాట వేదిక కన్వీనర్ వి.భీమాశంకర్, కో కన్వీనర్లు సిహెచ్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వెంకటాయపాలెం శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చినా రెవెన్యూ అధికారులు శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారన్నారు. ఈ జాప్యానికి కారణం ఈ కేసులో మొదటి ముద్దాయిగా ఉన్న ప్రస్తుత ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు రెవెన్యూ యంత్రాగాన్ని పావులా వాడుకుంటున్నారన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పిల్లల చదువు కోసం శిరోముండనం బాధితులు కుల ధ్రువీకరణ పత్రాలు అడిగినా ఇవ్వడం లేదని, శిరోముండనం బాధితులకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తే తోట త్రిమూర్తులుకు ఎక్కడ శిక్షపడిపోతుందో అనే భయంతో 28 సంవత్సరాల నుంచి జాప్యం చేస్తున్నారన్నారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను రెవెన్యూ అధికారులు అమలు చేయాలని, శిరోముండనం బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రామచంద్రపురం తహశీల్దార్ వెంకటేశ్వరరావుకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెంటపల్లి రామకృష్ణ, చల్లపూడి పట్టాభి, అంబటి కృష్ణ, గుబ్బల శ్రీను, రాజా రెడ్డి, రామయ్య, టి.లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

కాపు రిజర్వేషన్ అమలు చేసే పార్టీకే మద్దతు

ప్రజాశక్తి-రావులపాలెం

కాపులకు రిజర్వేషన్‌పై స్పష్టమైన హామీ ఇచ్చి అమలు చేసే పార్టీకే తమ మద్దతు ఉంటుందని కాపు జెఎసి నాయకులు చెప్పారు. రావులపాలెంలోకాపు జేఎసి రాష్ట్ర నేత ఆకుల రామకృష్ణ ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ కాపులకు బిసి రిజర్వేషన్లు తదితర సమస్యలపై స్పష్టమైన హామీ ఇచ్చిన పార్టీకే వచ్చే ఎన్నికల్లో కాపుల మద్దతు ఉంటుందన్నారు. ఈ నెల 28న విశాఖపట్నంలో జరిగే జెఎసి సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని ప్రకటించారు. కాపు జెఎసి ఏ పార్టీకీ వ్యతిరేకం కాదని, అనుకూలం కూడా కాదని తెలిపారు. కాపు, తెలగ, బలిజ, ఒంటరి కులాల సంక్షేమమే జెఎసి లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో ముద్రగడ పద్మనాభం సారధ్యంలో ఉద్యమం చేసి సాధించుకున్న ఫలాలు నేడు కాపులకు అందకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి రాజకీయ పార్టీ కాపులకు 60 అసెంబ్లీ సీట్లు, 9 పార్లమెంటు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాపు జేసి నాయకులు ఆరేటి ప్రకాష్ రావు, వాసిరెడ్డి ఏసుదాసు, నల్లా విష్ణు, చందు జనార్ధన్, దాసరి రాము, ముత్యాల రామదాసు, తోట రాజీవ్, సలాది రామకృష్ణ, ముచ్చర్ల శ్రీరాములు, మాకా శ్రీనివాస్, రంగిశెట్టి మంగబాబు, ఆకుల భాగ్యలక్ష్మి, ఉమామహేశ్వరి, నెంబర్ వన్ శీను, వేమన శ్రీనివాసరావు, ఇంటి శ్రీరామ్ మూర్తి, నందం సత్యనారాయణ, సాధనాల సత్యనారాయణ, ఆకుల భాస్కరరావు, నరేంద్ర పాల్గొన్నారు.

హెచ్‌డిఎఫ్‌సి బిజినెస్ సర్వీస్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అమలాపురం

నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్

ప్రభుత్వ ఉద్యోగులు, కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హెచ్‌డిఎఫ్‌సి బిజినెస్ కరస్పాండెంట్ కామన్ సర్వీస్ సెంటర్‌ను సోమవారం జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ బ్యాంక్ సేవలు, సిటిజన్ సర్వీసులు అన్ని స్థానిక కామన్ సర్వీస్ సెంటర్‌లో లభిస్తాయన్నారు. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ తరపున అఫీషియల్ ఔట్‌లెట్ బిజినెస్ కరస్పాండెంట్ కామన్ సర్వీస్ సెంటర్ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 26 రకాల బ్యాంకింగ్, సిటిజెన్ సేవలను అందిస్తుందన్నారు. వీటిలో సేవింగ్స్, కరెంట్ శాలరీ ఖాతాలు, బంగారు ఆభరణాలపై తాకట్టు రుణాలు, ఫిక్స్, రికరింగ్ డిపాజిట్ల సేకరణ, ట్రాక్టర్ రుణాలు, గృహ రుణాలు, రైత్వారీ ఖాతాలు, వినియోగదారుల డ్యూరెబుల్ రుణాలు, బైకుల రుణాలు సామాజిక భద్రత పథకాలు నగదు డిపాజిట్, విత్ డ్రా, ఇఎంఐ చెల్లింపులు, స్వీకరణ, రూ.పది వేల వరకు నగదు లావాదేవీలకు ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ సిహెచ్.సత్తిబాబు, నిమ్మల సత్యనారాయణ, వెంకట సూర్య రాజ కిరణ్, ఆకెళ్ల శ్రీనివాస్, గంధం గణపతిరావు, రాజేష్, కె.శ్యామ్‌బాబు, శివశంకర్ ప్రసాద్ పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ అమలాపురం మండలం చిందాడగరువు ఎంపిటిసి మోటూరి కనకదుర్గ, ఆమె భర్త వెంకటేశ్వరరావు సౌజన్యంతో సమకూర్చిన 150 దుప్పట్లను నిరుపేదలకు పంపిణీ చేశారు.

రూ.20 కోట్లతో అంచనా బడ్జెట్

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వార్షిక బడ్జెట్ ఎంతో దోహదపడుతుందని ముమ్మిడివరం నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం కౌన్సిల్ సమావేశపు హాల్లో సోమవారం చైర్మన్ ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూపొందించిన అంచనా బడ్జెట్‌ను సమావేశం ఆమోదించింది. రు. నగర వాసులు సకాలంలో పన్నులు చెల్లించడం ద్వారా వచ్చే ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుని, మారుతున్న కాలానికి అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు వ్యయాలను కేటాయించినట్టు చైర్మన్ తెలిపారు. 2022-23 సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకుని రూ.4 కోట్ల 61 లక్షల 49 వేలను ప్రారంభ నిల్వగా చూపినట్టు చెప్పారు. అభివృద్ధి సంక్షేమ పథకాలను అమలు చేయడానికి ప్రణాళికలను రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ బడ్జెట్ సమావేశంలో కమిషనర్ జి.లోవ రాజు, మేనేజర్ నూకరాజు, ప్రతిపక్ష ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోకేశ్వరిని అభినందిస్తున్న ఎంఎల్ఎ పొన్నాడ

లోకేశ్వరికి ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి-కాట్రేనికోన

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో ఎస్ఐగా ఎంపికైన తిరుమాని లోకేశ్వరిని ముమ్మిడివరం ఉఎంఎల్‌ఎ పొన్నాడ సతీష్ కుమార్ అభినందించారు. బలుసుతిప్ప గ్రామానికి చెందిన లోకేశ్వరిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని జీవితంలో స్థిరపడాలని సూచించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఓలేటి సతీష్, నాతి అలివేణి, మల్లాడి ఏడుకొండలు, నల్లా నరసింహమూర్తి పాల్గొన్నారు.

సహజ వనరుల్ని దోచేస్తున్నారు

ప్రజాశక్తి - ఆలమూరు

వైసిపి నాయకులు సహజ వనరులను దోచేస్తున్నారని జనసేన పార్టీ కొత్తపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు శ్రీనివాస్ ఆరోపించారు. మండలంలోని జొన్నాడ ఇసుక ర్యాంపులో సోమవారం బాట ఛార్జీలకు వ్యతిరేకంగా లారీ ఓనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరసనకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాట ఛార్జీల పేరుతో సామాన్యుల్ని బాదేస్తున్నారని, పేదవాడు గూడు కట్టుకోవడానికి గుప్పెడు ఇసుక దొరక్కుండా దోచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి చూపించే బిల్లులు 40 శాతం ఉంటే 60 శాతం దొంగ బిల్లులతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారని ఆయన అన్నారు. మీటరు తవ్వాల్సిన చోట 13 అడుగులు 14 అడుగుల వరకు తవ్వేసి నదీ గర్భాన్ని తూట్లు పొడుస్తున్నారన్నారు. వెంటనే ఈ ఛార్జీలను రద్దు చేసి ఇసుక సామాన్యుడికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సంగీత సుభాష్, కట్టా శ్రీనివాస్, తాళ్ల డేవిడ్, సూరపరెడ్డి సత్య, ఎంపిటిసి తమ్మన భాస్కరరావు, పడాల అమ్మిరాజు, సలాది జయప్రకాశ్, పాల్గొన్నారు.

ఊపందుకున్న కుల గణన సర్వే

ప్రజాశక్తి-అమలాపురం

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన అమలాపురం మున్సిపాలిటీలో ఊపందుకుంది. కొన్ని సమయాల్లో సర్వర్ సమస్య తలెత్తినప్పటికీ సచివాలయ కార్యదర్శులు, వాలంటీర్స్ ఇంటింటికీ వెళ్లి కుల గణన సర్వే చేపడుతున్నారు. అమలాపురం మున్సిపాలిటీలో 15 వార్డ్ సచివాలయాల్లో ఉన్న 302 క్లస్టర్స్‌లో కుల గణన సర్వే చేపట్టారు. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 17,213 కుటుంబాలు, 48,582 సభ్యులు ఉండడంతో సర్వే వేగంగా పూర్తి చేయడానికి మున్సిపల్ కమిషనర్ వొమ్మోలు అయ్యప్ప నాయుడు కసరత్తు మొదలు పెట్టారు. ప్రధానంగా ఈ సర్వేలో బియ్యం కార్డ్ నంబర్, నివాసం ఉంటున్న ఇంటి రకం, మరుగుదొడ్ల సౌకర్యం, తాగునీరు, గ్యాస్ సదుపాయం, పశు సంపద, కులం, ఉపకులం, పుట్టిన తేది, విద్యార్హతలు, వృత్తి వంటి తదితర వివరాలను యాప్‌లో నిక్షిప్తం చేస్తున్నారు. ఈ నెల 19 వ తేదీన ప్రారంభమైన కుల గణన ఇంటింటి సర్వే 28వ తేదీ లోపు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

విద్యుర్థులు ట్యాబ్‌లను ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-రావులపాలెం

పాఠశాలల్లో విద్యార్థులంతా ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లున ఉపయోగించుకోవలని రావులపాడు సర్పంచ్ మట్టా సత్యదేవి బాబ్జి అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో హెచ్‌ఎం సునీత అధ్యక్షతన ట్యాబ్‌లు పంపిణీ చేశారు. సర్పంచ్ సత్యదేవి మాట్లాడుతూ సిఎం వైఎస్.జగన్ విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ సకల సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి ఆశ కిషోర్, టీచర్ కె.వి శేఖర్ పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీదేవి

వైఎస్ఆర్ బీమా రూ .5 లక్షల అందజేత

ప్రజాశక్తి-రామచంద్రపురం

పట్టణంలోని 26 వార్డుకు చెందిన గుబ్బల లక్ష్మి ఇటీవల తొస్సిపూడి వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆమెకు వైయస్సార్ బీమా పథకం నుండి రూ.5 లక్షల మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి మృతురాలి భర్త కృష్ణకు సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీకాంత్ రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి-కపిలేశ్వరపురం

మండలంలోని అంగర పిహెచ్‌సి పరిధిలోని పడమర ఖండ్రికలో ఆరోగ్య సిబ్బంది పంపిణీ చేస్తున్న ఆరోగ్యశ్రీ కార్డులు, బ్రోచర్లను జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ కె.సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ఆరోగ్యశ్రీ యాప్ డౌన్లోడ్, వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్యక్రమంపై రూపొందించిన వీడియోను, అవగాహన కలిగిస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌సికి సంబంధించిన వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

టిడిపిలో పలువురు వైద్యుల చేరిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు సమక్షంలో ద్రాక్షారామంకు చెందిన ప్రముఖ వైద్యులు మడక రాంబాబు, కాకినాడకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ కొండమూరి సత్యనారాయణ, రామచంద్రపురం వైద్యులు రఘువీర్ కాంత్ చేరారు. టిడిపి రామచంద్రపురం ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా డాక్టర్ మడక రాంబాబు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు దూరదృష్టి కలిగిన నేత అని, ఆయనను ఆదర్శంగా తీసుకుని పార్టీలో చేరినట్టు చెప్పారు. తెలుగుదేశం, జనసేన పార్టీల ఉమ్మడి నాయకత్వంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీకి తామంతా పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. పార్టీలో చేరికలు వల్ల పార్టీ మరింత బలోపేతం అవుతుందని రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు.

సాగునీటి ఎద్దడిపై ఇరిగేషన్ ఎఇ నిర్బంధం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఎఇని నిర్బంధించిన రైతులు

తీవ్ర సాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న రైతులు వంటకాలును పరిశీలించేందుకు వచ్చిన ఎఇని సోమవారం నిర్బంధించారు. వాడపప్రు పంట కాలువ శివారు కూనవరం టైలెండ్ ప్రాంతంలో వంటకాలువకు సాగునీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూనవరం ప్రాంతంలో వంటకాలువపై సుమారు 500 ఎకరాల వరకు వరి సాగు జరుగుతోంది. నారుమళ్లు వేసిన నాటి నుంచి సాగు నీరు సక్రమంగా అందకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రస్తుతం నాట్లు వేసేందుకు చేలను సిద్ధం చేసినా సాగునీరు అందకపోవడంతో నాట్లు వేయలేకపోయామని రైతులు వాపోతున్నారు. ఈ సమయంలో ఇరిగేషన్ ఎఇ శివరామకృష్ణ పంట కాలువ పరిశీలనంచేందుకు వచ్చారు. దీంతో ఎఇని రైతులు చుట్టుముట్టి నిర్బంధించారు. సాగునీటి ఎద్దడి ఇబ్బందులపై అనేకసార్లు ఫోన్ చేసి తెలిపినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కాలువలో పూడిక తొలగించే పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించామని, నెల రోజులగా తాను కాంట్రాక్టర్‌ను పూడిక తొలగించాలంటూ కోరుతున్నానని ఎఇ రైతులకు తెలిపారు. సుమారు 14 కిలోమీటర్లు పొడవు ఉన్న పంట కాలువ ఎగువ భాగంలో పూడిక తీత పనులు ప్రారంభమై ఇప్పటివరకు నాలుగు కిలోమీటర్ల మేర పూడిక తొలగించారని చెప్పారు. మరికొద్ది రోజుల్లో కూనవరం శివారు ప్రాంతంలో కూడా పూడికతీత పనులు జరుగుతాయన్నారు. ఇప్పటికే నారుమళ్లు ఎండిపోయి నాట్లు వేసే చేలు బీటలువారి పోతున్నాయని పంట కాలువ శివారు ప్రాంతం నుంచి పూడికతీత పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేశారు. సమస్యను ఎఎంసి డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, సహకార సొసైటీ చైర్మన్ ఊటాల రామాంజనేయులు మంత్రి పినిపే విశ్వరూప్‌కు ఫోన్ చేసి తెలిపారు. దీనిపై స్పందించిన మంత్రి విశ్వరూప్ ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి జెసిబి ద్వారా వంటకాలువలో పూడికను తొలగించేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. మూడు రోజుల్లోగా కూనవరం శివారు ప్రాంతానికి సాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకుంటానని ఎఇ శివరామకృష్ణ రైతులకు హామీ ఇవ్వడంతో రైతులు శాంతించారు.

4వ విడత వైఎస్ఆర్ ఆసరాపై సమీక్ష

ప్రజాశక్తి - ఆలమూరు

4వ విడత వైఎస్ఆర్ ఆసరాపై సమీక్ష నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన ఎంపిడిఒ కె.జాన్ లింకన్ ఆధ్వర్యంలో 'నాలుగో విడత వైఎస్ఆర్ ఆసరాకు సంబంధించి సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 23న కొత్తూరు సెంటర్ ఎస్‌జెఆర్ ఫంక్షన్ హాల్‌లో జరగనున్న మండల పరిధిలోని పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, చింతలూరు, సూర్యారావపేట, కలవచర్లకు సంబంధించి స్వయం సహాయక సంఘాలకు ఆసరా అందజేస్తామని చెప్పారు. దీనికి ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమం జయప్రదం చేయాలని వారు కోరారు. మండల పరిధిలోని 18 గ్రామాలకు గాను 4వ విడత వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా 1654 గ్రూపులకు, 16,540 మంది సభ్యులకు, రూ.15.02 కోట్లు లబ్ధి చేకూరనుందన్నారు. దీంతో నాలుగు విడతలు మొత్తం కలిపి రూ.60.08 కోట్ల లబ్ధి చేకూరనుందన్నారు. నాలుగు విడతలకు గాను ఇప్పటికే మూడు విడతలు అందజేసినట్లు, 4వ విడత ఈ నెల 23 నుండి 31 వరకు స్థానిక ఎంఎల్‌ఎ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తూ లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. ఆయా గ్రామ మహిళా సంఘాలకు పూర్తి వివరాలు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్, సర్పంచ్ తమ్మన శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ యనమదల నాగేశ్వరరావు, వైసిపి నేతలు నామాల శ్రీనివాస్, పాలంగి ఉమాదేవి, ఎపిఎం ధనరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత

ప్రజాశక్తి-ఆత్రేశయపురం

మండలంలోని మెర్లపాలెం ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు 23-24 సంవత్సరానికి సంబంధించిన ప్రభుత్వం సమకూర్చిన టాబ్స్‌ను గ్రామ సర్పంచ్ ఎం.శ్రీరామచంద్రమూర్తి, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ పి.లక్ష్మి విద్యార్థులకు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సిహెచ్.శ్రీహరి, ఉపాధ్యాయులు ఆర్‌వివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-ఐ.పోలవరం

అన్ని హైస్కూల్స్‌లో 10వ తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ ఆధ్వర్యాన న్యూ మోడల్ టెస్టు పేపర్ల పుస్తకాలను అందించారు. మురమళ్ల వరలక్ష్మి ఏజన్సీ యజమాని నడింపల్లి వివి సూర్యవర్మ వీటిని సమకూర్చారు. సోమవారం మరమళ్ల హైస్కూల్ హెచ్‌ఎం కె.వెంకటలక్ష్మి, విద్యాకమిటీ చైర్‌పర్సన్ ఎస్.వెంకటరమణ సమక్షంలో విద్యార్థులకు వర్మ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పెన్నాడ శ్రీనివాసరావు, టి.దుర్గాప్రసాద్, మట్టపర్తి శ్రీనివాసరావు, పడమటి ఏడుకొండలు, కోశాధికారి ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 194/2015

Between:
Y.Atchamma (died) and Others ...*Plaintiffs*
AND
S.Nageswara Rao and Others ...*Defendants*

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. 30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 195/2015

Between:
Yeluri Venkata Ramana @ Venkata Lakshmi ...*Plaintiff*
AND
S.Nageswara Rao and Others ...*Defendants*

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. 30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry

In the Court of the Prl. Junior Civil Judge, Rajahmundry
O.S. 196/2015

Between:
Yeluri Kameswari ...*Plaintiff*
AND
S.Nageswara Rao and Others ...*Defendants*

D-4: Vattikuti Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-5: Vattikuti Ajay, S/o. Venkata Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.
D-6: Vattikuti Sowmya, D/o. Satyanarayana Murthy, D.No. 85-26-05/7, Saikutir Apartments, RTC Colony, Rajahmundry.

పై నెంబరులో మీకు శ్రీ కోర్టు వారు ది. 30-1-2024 సం॥ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు వాయిదా రోజు ఉదయం 10.30 గం॥లకు పై కోర్టులో స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.
వాది తరపు అడ్వకేట్స్
G.SRINIVASULU REDDY
K.V.N.BHOTLU
Advocates, Rajahmundry